# రాత-కోత



హాస్యావధాని శంకరనారాయణ

## వావి'లా'ల

ఎవరైనా పెద్దవాళ్ళు ఎలా అయ్యారయ్యా అంటే చిన్నవాళ్ళను పెద్దగా చూడబట్టేనని ఢంకా బజాయించి చెప్పగలను. నేను ఆంధ్రప్రభ దినపత్రికలో 'ఫన్' చేస్తున్న రోజులు. వారం వారం ఆదివారం ఆంధ్రప్రభలో నా ఫన్ గన్ కాలమ్ వచ్చేది. (ఇది ఇటీవల పుస్తకరూపంలో కూడా వచ్చింది. 2004 అక్టోబర్ 9న అమెరికాలో సిలికానాంధ్ర సాంస్కృతికోత్సవంలో ఈ గ్రంధాన్ని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు కిరణ్ ప్రభ గారు ఆవిష్కరించింది) ఈ కాలమ్‌ను ఎంతో మంది పెద్దలు ఇష్టపడేవారు. వారిలో వావిలాల గోపాలకృష్ణయ్య గారు (ఎటువంటి విశేషణాలు అవసరం లేని వ్యక్తి) ఒకరు. ఆయన నన్ను చూడటానికి హైదరాబాదు లోని ఆంధ్రప్రభ ఆఫీసుకు వచ్చారు. నేను చాలా సంతోషించాను. ఫన్ గన్ మీద ఆశీస్సులు రాసి ఇమ్మని అడిగాను. రాసి ఇచ్చారు. నా 'రాత' బాగుందనుకున్నాను. అంతటి వాడి దర్శన భాగ్యం కలిగింది, అది శాశ్వతంగా ఉండాలనుకున్నాను. "వావిలాల గారూ! మనం ఫోటో దిగుదామా! " అన్నాను. 'మీరు జర్నలిస్టులు. మిమ్మల్ని నమ్మడానికి వీలు లేదు,' అన్నారు వావిలాలవారు.

'జర్నలిస్టులంటే హంతకులా? దొంగలా?' అన్నాను. ఆయన ఉద్దేశమేమిటో అర్థంకాలేదు కానీ పగలబడి నవ్వారు. ఆ 'సీను' లోనే ఫోటో దిగాను అంతకుముందెప్పుడు నేను వావిలాలవారు నవ్వుతూ ఉన్న ఫోటో చూడలేదు. ఆయన నవ్వుతున్న ఫోటో చూసి చాలా సంబరపడ్డాను. భద్రంగా దాచుకున్నాను.

ఆ రోజు రాత్రి వావిలాలవారు గుంటూరు కి వెళ్ళాలి. టిక్కెట్టు బుక్ చేసుకున్నారు. ఆయన రమ్మంటే నేను, నా మిత్రుడు వై.ఎస్. శ్రీనివాసరావు ఆయన హైదరాబాద్ వారాసి గూడాలో ఉంటున్న ఇంటికి వెళ్ళాం. రైల్వే స్టేషన్‌కు ఆయన శ్రీనివాసరావు స్కూటర్ మీద ఎక్కి వెళ్ళారు. అప్పుడు ఆయన వయస్సు 92 సంవత్సరాలు. నిరాడంబరులైన ఇంతటి మహాత్ములు 'సంభవామి యుగే యుగే' అన్నట్టు శతాబ్దానికి ఇద్దరో ముగ్గురో కనిపిస్తారు.

అలాగే నన్ను చూడడానికి ఉప్పులూరి కాళిదాసుగారు కూడా అంధ్రప్రభకి వచ్చారు. ఆయన 'ఆనందవాణి' పత్రిక వ్యవస్థాపక సంపాదకులు. శ్రీ శ్రీ, ఆరుద్ర వంటివారు ఈ పత్రికలో పని చేశారు. ఫన్

గన్ చదివిన కాళిదాసుగారు నన్ను చూసి ఆశీర్వదించారు. ‘స్టాండర్డు పెంచమంటారా ?‘అని అడిగాను. ‘పెంచనవసరం లేదు వీలయితే తగ్గించు‘ అన్నారు. మీ రచనలు సి. రాజగోపాలావారి రచనలలాగా ఉంటాయన్నారు. పెద్దవాళ్ళ ఆశీర్వచనాల్లో అతిశయోక్తులుంటాయి. వారి ఔదార్యానికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి అంతే.

   